మత్స్యకారుల కుటుంబాలకు అరబిందో ఆర్థిక సాయం

విశాలాంధ్ర-రణస్థలం : ఎన్‌జీఆర్‌పురం, చింతపల్లి పంచాయతీలో ఉన్న ఇద్దరు మత్స్యకారులు కుటుంబ పోషణ కోసం చేపల వేటకై వలసవెళ్లి ఇతర ప్రాంతాల్లో మరణించారు. ఆ ఇద్దరు మత్స్యకారుల కుటుంబాలకు అరోబిందో ఫార్మా ఫౌండేషన్ వారు బుధవారం మూడు లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. అరోబిందో ఫార్మా యాజమాన్యం నిత్యానందరెడ్డి, శరత్ చంద్రరెడ్డిలు ఆదేశాలమేరకు ప్రతి కుటుంబానికి ఒకటిన్నర లక్షల చెక్కులు అరోబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు భాధిత మత్స్యకారుల కుటుంబాలకి అందజేశారు.

వి.ఎన్.పురం విధ్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

విశాలాంధ్ర-నరసన్నపేట : మండలంలో వి.ఎన్.పురం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంచాయితీ సర్పంచ్, పుట్టా ఆదిలక్ష్మి బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 50మంది విధ్యార్థులకు మొదటి విడతగా 25, రెండవ విడతగా 25ట్యాబ్‌లు అందజేశారన్నారు. ముఖ్యమంత్రి, జగన్మోహన్‌రెడ్డి ప్రైవేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విధ్యార్థులకు ఆంగ్లంలో పాఠ్యాంశాలు భోదించాలనే ఆలోచనతో బైజ్యూస్ సంస్థ సహకారం తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, లక్ష్మి, ఉపాధ్యాయులు, రమేష్, విద్యా కమిటీ చైర్మన్, సంహాలం, విధ్యార్థుల తల్లితండ్రులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి : పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలోగల విద్యుత్ వినియోగదారులకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ప్రసాద్, కవిటి విద్యుత్ శాఖ ఏఈ నేతాజీ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం 132 కేవీ పలాస సబ్ స్టేషన్ నందు అత్యవసర మరమత్తులు కారణంగా ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పలాస, మందస, వజ్రకొత్తూరు, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలలలో విద్యుత్‌ను నిలుపు వేయబడునని తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని కోరారు.

వైకాపా నుంచి టీడీపీలోకి....

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం దుప్పిలపాడు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీకు చెందిన ఉప సర్పంచ్ గురువెల్లి అప్పన్న, వార్డు మెంబర్ ఎండ దాలినాయుడు, వాలంటీర్ పేడాడ అప్పన్నలతో పాటు పలు కుటుంబాలతో రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడుల సమక్షంలో టిడిపిలో చేశారు. వీరికి మంగళవారం రాత్రి నందిగాం మండలం కాపు తెంబూరులో జరిగిన బహిరంగ సభలో పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేశం నేతలు బోయిన రమేష్, సాసుమంతు ఆనందరావు తదితరులు ఉన్నారు.

నైపుణ్య కళాశాలలో శిక్షణకు ప్రవేశాలు

విశాలాంధ్ర-ఎచ్చర్ల : పీఎస్ఎస్డిసి ఆధ్వర్యంలో ఎచ్చెర్ల టిటిడిసిలోని నైపుణ్య కళాశాలలో పేషంట్ అసోసియేట్ కోర్సులు శిక్షణకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాస్ తెలిపారు ఈ కోర్సులో సెక్షన్‌కి ఏదైనా డిగ్రీ పీజీ పూర్తిచేసి 28 ఏళ్లలోపు గల యువతీ యువకులు అర్హులన్నారు మూడు నెలల శిక్షణాకాలంలో ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు అనంతరం ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి కల్పిస్తామన్నారు వచ్చే నెల రెండవ తేదీన ప్రారంభం అయ్యే ఈ శిక్షణ తరగతుల కోసం ఫోన్ నెంబర్లు 8247656581, 7680945357కు సంప్రదించాలన్నారు.

దాతలు సహకారంతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలం గరుడభద్ర పంచాయతీలో శ్రీఉమాశంకరాలయం అభివృద్ధి పనులు కోసం జామి మోహనరావు 8000 రూపాయలు విరాళంగా ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఆలయ అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని సర్పంచ్ ప్రతినిధి గూడ ఈశ్వరరావు కోరారు.

ఆడుదాం ఆంధ్రాను పండుగలా నిర్వహించాలి

- జనవరి1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశకు శ్రీకారం
- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని అన్ని చోట్లా పండుగ వాతావరణంలో నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, వైద్య ఆరోగ్య అధికారులు, ఇతర ఉన్నతాధికారు లతో ఆడుదాం ఆంధ్ర, జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ కార్యక్రమాలపై టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో 364 సచివాలయాల పరిధిలో అన్ని చోట్లా క్రీడలు మొదలు కావాలని, మొత్తం 1243 మ్యాచ్ లను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని, నూటికి నూరు శాతం ఫలితాలను రాబట్టాలని ఆదేశించారు. అన్ని చోట్లా ప్రేక్షకుల హాజరు కూడా నమోదు చేయాలని, మ్యాచ్ ఆరంభానికి ముందు, ఫలితం తేలిన తర్వాత తప్పనిసరిగా ఆన్లైన్ చేయాలనీ స్పష్టం చేశారు. ఆడుదాం ఆంధ్రకు ఎలాంటి బడ్జెట్ కొరత లేదని అన్ని సచివాలయాలకు అవసరమైన నిధులను జమ చేయడం పూర్తయిందని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ క్రీడలు నిర్వహిస్తున్న మైదానాల్లో క్రీడాకారులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, వాటి ఫోటోలను కూడా ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని సూచించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ గురించి మాట్లాడుతూ 2024 జనవరి 1 నుండి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్ల భాగస్వామ్యంతో సచివాలయాల వారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. శిబిరం పేరు, వైద్యుల పేర్లతో జియో ట్యాగింగ్ చేయాలని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ రిఫరల్ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో ఆర్ వెంకట్రామన్, డిఎస్‌డిఓ కే.శ్రీధర్, సెట్ శ్రీ సీఈవో ప్రసాదరావు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, డీఈవో వెంకటేశ్వరరావు, డిఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రకాశ రావు తదితరులు ఉన్నారు.

విశ్వసనీయతలేని వ్యక్తి జగన్‌రెడ్డి

- ఇచ్ఛాపురం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్

విశాలాంధ్ర-కవిటి : వాడుకుని వదిలేయడం జగన్ రెడ్డి నైజమని తన సొంత ప్రయోజనం కోసం ఎవరినైనా బలిపెట్టడం జగన్ రెడ్డి లక్షణం అని ఇచ్ఛాపురం నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ విమర్శించారు. ఈమేరకు బుధవారం రామయ్యపుట్టుగ ఎమ్మెల్యే అశోక్ నివాసం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల విశ్వసనీయత లేని వ్యక్తి జగన్ రెడ్డి అని 57 నెలల పాలనలో ప్రజలకు ఈ విషయం స్పష్టమైందనీ అన్నారు. ఓట్లేసి గెలిపించిన పులివెందుల ప్రజలకు నమ్మకద్రోహం చేశారని అన్నారు. ఎత్తుకొని పెంచిన చిన్నాన్నను కిరాతకంగా హత్యచేసిన నేరస్థుల్ని కాపాడుతున్నారాని విమర్శించారు. ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిపించిన కడప ప్రజల్ని మోసం చేశారనీ అలాగే కడపకు స్టీల్ ప్లాంట్ లేదు కదా అన్నమయ్య డ్యాం బాధితుల్ని నట్టేట ముంచారని అన్నారు. కృష్ణా, తుంగభద్ర జలాలపై హక్కుల్ని ధారాదత్తం చేసి రాయలసీమ ప్రాజెక్టులకు ద్రోహం చేశారని అన్నారు. అలాగే తన తల్లి, చెల్లికి ద్రోహం చేసిన ఘనుడని అన్నారు. తండ్రికి ఆత్మగా పేరుబడ్డ కేవీపీ రామచంద్రరావు, నీడగా ఉన్న సూర్యుడు నేడు జగన్ వెంట లేరని అన్నారు. నమ్మి ఓట్లేసిన దళితులు, మైనార్టీలకు ద్రోహం చేసి సిటిజన్ బిల్లుకు పార్లమెంట్ లో ఓటు వేశారని అన్నారు. వాలంటీర్లను, సీపీఎస్ రద్దు హామీపై ఉద్యోగుల్ని మోసం చేశారని అన్నారు. మద్యనిషేధం చేసి ఓట్లు అడుగుతానని నమ్మబలికి మద్యం ఆదాయాన్ని బ్యాంకులకు తాకట్టు పెట్టారని విమర్శించారు. నాసిరకం మద్యం పోసి మహిళల మాంగల్యాలు తెంచుతున్నారనీ మండిపడ్డారు. ఈ సమావేశంలో సోంపేట మాజీ జడ్పిటిసి సభ్యుడు కోరాడ చంద్రమోహన్, బెందాళం సురేష్, ప్రగడ మనిబాబు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది పనితీరు బాగోలేదు...

- ఇష్టానుసారంగా సెలవులు ఎవరిచ్చారు..?
- మంత్రి డా. సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర-పలాస : మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రి వస్తున్న రోగులకు ఎందుకు వైద్య సేవలు అందించడంలేదని, పనితీరు మార్చుకోకపోతే సహించేది లేదని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పలాస ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి డా.సీదిరి అప్పలరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వార్డులు, వైద్యుల గదులు పరిశీలించగా 12 మంది రోగులకు 17 మంది సిబ్బంది ఉండడం చూసి అవాక్కయ్యారు. వైద్యుల గదుల్లో వైద్యులు లేకపోవడంతో ఆసుపత్రి ఇంచార్జి సూప రింటెండెంట్ డా.ఆనెపు సుశీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది వైద్యులు సెలవు పెట్టగా మరి కొంత మంది విధుల్లో ఉన్నట్లు సంతకాలు చేసి ఆసుపత్రి బయటకు వెళ్లిపోవడంపై మంత్రి డాక్టర్ సీదిరి తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రజా ఆరోగ్యంపై బాధ్యత లేకుండా వైద్యులు ఉండటం సరికాదన్నారు. నాడు-నేడు ద్వారా కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆసుపత్రిలో ఆధునీకరణ చేయడం జరిగిందని పేద ప్రజలకు కనీస వైద్యం అందించకపోతే రోగులు ఎలా వస్తారని ప్రశ్నించారు. 12 మంది రోగులకు 17 మంది సిబ్బంది అంటే సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు. నిండు గర్భిణీలకు వేరే ఆసుపత్రికి రిఫర్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఇటీవల పలాస ప్రభుత్వ ఆసుపత్రి నుండి గర్భిణిని 108 వాహనంలో టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో ఆమె 108 వాహనంలో ప్రసవించిన విషయం ఉన్నత స్థాయి అధికారులకు మంత్రి ఫోన్ లో తెలిపారు. పలాస ఆసుపత్రి పని తీరుపై ఇటీవల రోజు వార్తలలో వస్తున్న సిబ్బంది, వైద్యుల తీరు మారకపోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. విధి నిర్వాహణలో అంకితభావంతో పనిచేయాలని, ఇక్కడ పని చేయడం ఇష్టం లేకపోతే బదిలీ చేసుకుని వెళ్లిపోవచ్చని తీవ్రం గా హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని అన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

ప్రారంభమైన రీజనల్ స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర-ఎచ్చర్ల : చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని సాంకేతిక విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జే సత్యనారాయణ మూర్తి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరగనున్న ప్రాంతీయ స్థాయి అంతర పాలిటెక్నిక్-2023 స్పోర్ట్స్ మీట్ బుధవారం ప్రారంభమైంది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడల్లో చురుకుగా ఉన్న విద్యార్థులు చదువులో కూడా ప్రతిభ చూపుతారని చెప్పారు నిర్దేశించిన లక్ష్యం నెరవేర్చుకునేందుకు సరైన ప్రణాళిక ఉండాలన్నారు. లక్ష్యసాధనలో ఎన్ని ఒడిదుడుకులైన సమర్థవంతంగా ఎదుర్కోవాలి అన్నారు క్రీడలతో క్రమశిక్షణ సాయపడే గుణం ఆత్మస్థైర్యం పెంపొందుతుందని చెప్పారు ఆశాఖ డిడి డాక్టర్ ఎంఏవి రామకృష్ణ మాట్లాడుతూ ఈ పోటీలో విజయం సాధించిన క్రీడాకారులు వచ్చే నెల 4,5,6 తేదీలు అనంతపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలన్నారు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి జానకిరామయ్య మాట్లాడుతూ ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాల్లోని 10 పాలిటెక్నిక్ కళాశాల నుంచి 416 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదరరావు పిడిల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సీనియర్ అజ్యాపకుడు డి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు ఫలితాలు టేబుల్ టెన్నిస్ బాలికల సింగిల్స్‌లో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల కే.హర్షిత డబుల్సులో ఇదే కళాశాలకు చెందిన కే.హర్షిత బి పూజిత విజేతగా నిలిచారు టేబుల్ టెన్నిస్ బాలురు విభాగంలో సింగిల్స్‌లో వి.శ్రీధర్ (ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం) డబుల్స్ లో శ్రీ వెంకటేశ్వర కళాశాలకు చెందిన ఎం రాఘవేంద్ర నాయుడు, కే.కుమారస్వామి గెలుపొందారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయాలి

- న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష

విశాలాంధ్ర-ఆమదాలవలస : ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ 27/2023 ను రద్దు చేయాలని జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఆమదాలవలస బార్ కౌన్సిల్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి భాయ్ డిమాండ్ చేశారు. భూ హక్కుల చట్టం చట్టం జీవో నంబర్ 512 ను గెజిట్ నోటిఫికేషన్ విడుదల న్యాయవా దులకు గొడ్డలి పెట్టుగా ఉందని తక్షణమే ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాం డ్ చేశారు. బుధవారం కోర్టు కార్యాలయా వరణంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఈ చీకటి చట్టాన్ని తెచ్చారని విమర్శించారు. ప్రజల భూములు, స్థిరాస్తి హక్కులను, న్యాయవ్య వస్థ పరిధి నుండి (సివిల్ కోర్టులు) తొలగించి రాజకీయ దళారీ కబ్జాదారులకు అప్పగించ డమే దీని ముఖ్య ఉద్దేశమని విమర్శించారు. ఇటువంటి చీకటి చట్టాలను రద్దు చేసేంత వరకు నిరసనల ఆందోళన కొనసాగిస్తామని వివరించారు. ఈ దీక్ష కార్యక్రమంలో సీని యర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, కృష్ణదాస్ కార్యాలయం ముందు బైఠాయించిన 'అంగన్వాడీలు'

విశాలాంధ్ర-నరసన్నపేట : నియోజకవర్గ ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ క్యాంపు కార్యాలయం ముందు బుధవారం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు బైఠాయించారు. ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు యూనియన్(సిఐటియు) పిలుపు మేరకు నరసన్నపేట ప్రాజెక్ట్ కమిటీ నాయకత్వంలో ర్యాలీగా బయలుదేరి, ఎమ్మెల్యే, కృష్ణదాస్ క్యాంపు కార్యాలయానికి చేరుకొని, తమ డిమాండ్లు పరిష్కారించాలని నినాదాలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, మిని సెంటర్లను మెయిన్ సెంటర్ వర్కర్లుతో సమానంగా వేతనాలు, పదోన్నతలు అర్హత కల్పించాలని కోరారు. ప్రభుత్వాన్ని ఒప్పించి, తమ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే, కృష్ణదాస్‌కు వినతి పత్రాన్ని అంచేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ మీవి న్యాయపరమైన డిమాండ్లని, వాటి పరిష్కారానికి ప్రజా ప్రతినిధిగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి, పేదల కొసం ఆలోచించే వ్యక్తి కనుక మీ సమస్యలు పరిష్కరిస్తారనే నమ్మకం తనకు ఉన్నదని, కొంత సమయం ప్రభుత్వానికి ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, ఆరంగి మురళీధర్, వైసిపి ప్రతినిధులు, రాజాపు అప్పన్న, కోటిపల్లి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా నాయకులు, ఎం.జయలక్ష్మి, ఆర్.సురేష్‌బాబు, ఏ.సత్యన్నారాయణ, నరసన్నపేట ప్రాజెక్ట్ కమిటీ అంగన్వాడీ నాయకులు, డి.సరోజిని, పి.భాగ్యలక్ష్మి, టి.అమరావతి, జి.రామలక్ష్మి, సారవకోట ప్రతినిధులు, ఆశా, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర-ఎచ్చర్ల : పర్యావరణ పరిరక్షణకు అందరూ బాధ్యత వహించాలని జిల్లా పర్యాటక అధికారి ఎన్ నారాయణరావు అన్నారు. ఎచ్చెర్లోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ ఇంటర్మీడియట్ కళాశాలలో బుధవారం యువ టూరిజం క్లబ్బులను ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మొక్కలు నాటుట మట్టి పాత్ర వినియోగం విద్యుత్ వినియోగం తగ్గింపు నీటిని పొదుపుగా వాడడంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి చిట్టిబాబు టూరిజం అసిస్టెంట్ మేనేజర్ డి.రమేష్ అధ్యాపకుడు పి.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆడుదాం ఆంధ్రా

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలోని జలుమూరు, పెద్దదూగాం, అంధవరం సచివాలయ పరిధిలో అతిపెద్ద మెగా టోర్నీ ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు రెండవ రోజు బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ దామోదరరావు, ఎమ్మార్వో బి.సత్యం, ఇఓపిఆర్ డి ఉమామహేశ్వరరావు, ఎంఇఓలు బమ్మిడి మాధవరావు, ఎంవిఆర్ఎస్ ప్రసాద్ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు. 5 ఆటలు ఖోఖో, క్రికెట్, టెన్నీస్, వాలీబాల్, కబడ్డీ ఆడించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది, వాలంటీర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులు గుడ్ల సత్యనారాయణకు అభినందన

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ సూర్య వాకర్స్ క్లబ్ క్లబ్ ప్రతినిధి గుడ్ల సత్యనారాయణ కు బుధవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందించారు. సామాజిక సేవకునిగా గత 30 ఏళ్లుగా శ్రీకాకుళం జిల్లాలో సేవలు అందించే గుడ్ల సత్యనారాయణ నడక ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లిన వారిలో అగ్రగణ్యులు అని పలువురు నడక సంఘాల నేతలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇటీవల విశాఖట్నంలో జరిగిన అంతర్జాతీయ నడక సంఘాల సదస్సులో ఉత్తమ కో ఆర్డినేటర్ గా గుర్తిస్తూ గౌరవ పురస్కారాన్ని అందుకున్న సందర్భంలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉన్న నడక సంఘాల నేతలు జి. ఇందిరా ప్రసాద్, కూన వెంకట రమణ మూర్తి, పొట్నూ రు గోవింద గుప్తా, శాస పు జోగి నాయుడు, సురేష్ పండా ,అన్నెపు సత్యనారాయణలు అభినందించారు. ఈకార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గోలి సంతోష్, బత్తుల దేవీప్రసాద్, గురు ఆనందరావు, ఎం. మల్లి బాబు, జెసి పట్నాయక్ గుడ్ల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

కరవంజలో 'వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం'

విశాలాంధ్ర-జలుమూరు : భారత్ ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న "వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర" కార్య క్రమం బుధవారం జలుమూరు మండలం కరవంజలో దీనిలో భాగంగా ప్రధాని మోదీ ప్రసంగం వీడియోలను మొబైల్ స్క్రీన్పై ప్రదర్శించారు. అనంతరం వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర కరపత్రాలను ప్రదర్శించారు. స్థానిక సర్పంచ్ జుత్తు నేతాజీ, వివిధ శాఖల మండల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సీపీఐ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : సిపిఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు శ్రీకాకుళం రూరల్ ఏరియా సింగుపురం, నైర, భైరివానిపేట, ఎఫ్‌సిఐ గొడౌన్ ఏరియా, సిలగాం సింగువలస, తండేంవలస గ్రామాల్లో జిల్లా సీపీఐ కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి జండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లాకన్వీనర్ జి.రామకృష్ణ, రైతు నాయకులు సిమ్మ కరువయ్య, పి.రాజారావు, ఏ.రాజు తదితరులు, అలాగే నైరా గ్రామంలో అప్పారావు, అప్పల నరసమ్మ, బీవీ పేటలో బి. లలితమ్మ, సాయమ్మ, పార్వతమ్మ, ఎఫ్‌సిఐ దగ్గర టి. రాజులమ్మ దంపతులు, లక్ష్మి రాజు తదితరులు, తండేంవలస లో కోళ్ల తవుడు, కాళ్ళ బుచ్చమ, కోళ్ల సావిత్రి, పి నేలవేణి తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ తమ్మినేని ఇంటిని ముట్టడించిన అంగన్వాడీలు

విశాలాంధ్ర-ఆమదాలవలస : రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల ఆందోళనలో భాగంగా సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఇంటిని అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు బుధవారం ముట్టడికి యత్నించారు. సిఐటియు నాయకులు, అంగన్వాడీ యూనియన్, ఐసిడిఎస్ పరిధి కార్యకర్తలు ఆయాలు కార్యాలయం నుంచి నినాదాలు చేసుకుంటూ స్పీకర్ తమ్మినేని సీతారాం ఇంటి వద్దకు చేరుకున్నారు అప్పటికే మోహరించిన పోలీసులు కార్యకర్తలను నిలువరించారు. అయితే కార్యాలయ కార్యదర్శులకు వినతి పత్రాన్ని అందించి తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీల్లో బోరుభద్ర జట్టు ముందంజ

మండల స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో బోరుభద్ర గ్రామానికి చెందిన అంబేద్కర్ క్రికెట్ టీం మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలకు ఎంపికయ్యింది. గత రెండు రోజుల నుంచి ఉమిలాడ సచివాలయం పరిధిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొని బుధవారం నాటికి మండల స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు బోరుభద్ర క్రికెట్ జట్టు కెప్టెన్ చింతాడ రేవంత్ తెలిపారు. తన ప్రత్యర్థి జట్టుపై తక్కువ ఓవర్లలో అధిక రన్ లు చేసి మండల స్థాయికి మండల స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయనతో పాటు చింతాడ జోగేశ్వరారావు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

రెండవ రోజు కొనసాగిన నిరసన దీక్ష

విశాలాంధ్ర-ఆమదాలవలస : సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. బుధవారం రెండో రోజు నిరసన దీక్షను కొనసాగించారు. ఆముదా లవలస మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది తమ డిమాండ్ల పరిష్కారానికి నిరాహార దీక్ష చేపట్టారు. సిఐటియు ఉపాధ్యక్షురాలు నాగమణి పాల్గొని మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అందిస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత వాటిని విస్మరించారని విమర్శిం చారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ శానిటేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సంతోష్ కుమార్ పర్యవేక్షణలో ఈ నిరసన దీక్ష చేపట్టారు కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అచెన్నాయుడును కలిసిన సంతబొమ్మాళి నాయకులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచన్నాయుడును బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో సంతబొమ్మాళి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న, బోరుభద్ర మాజీ ఎంపీటీసీ వజ్జ ప్రభాకర్ రావు, సంతబొమ్మాళి మండలము తెలుగుదేశం పార్టీ కోశాధికారి, సీనియర్ నాయకులు సవ్వాన ప్రసాదరావుతోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిపై ఫిర్యాదులు వస్తే చర్యలు - డిసిహెచ్‌ఓ భాస్కరరావు

విశాలాంధ్ర-పలాస : పలాస ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పని తీరు బాగులేదని, ఇకపై వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన, ఆసుపత్రిపై పిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త భాస్కరరావు వైద్యాధికారులకు హెచ్చరించారు. ఆసుపత్రి నిర్వహణ బాగులేదని, ఆసుపత్రి తనిఖీ చేపట్టిన మంత్రి సీదిరి అప్పలరాజు డిసిహెచ్‌ఓ భాస్కరరావు, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో బుధవారం సాయంత్రం డిసిహెచ్‌ఓ ఆగమేఘాలతో పలాస ఆసుపత్రిని సందర్శించి వైద్యాధికారులతో రహస్యంగా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రికి వస్తున్న రోగులకు ఎందుకు వైద్య సేవలు అందించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి పని తీరు పై పత్రికల్లో కథనాలు వచ్చినా, ఆరోపణలు వచ్చినా ప్రతీ ఒక్కరు పై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయనతో పాటు పలాస ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ ల్యాడ్స్ పనులను త్వరితగతిన చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్
- నిధులు వినియోగంలో శ్రీకాకుళానికి మొదటి స్థానం
- ఎంపీ రామ్మోహన్ నాయుడు హర్షం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి 17వ లోక్ సభ పార్లమెంట్ సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం కింద నిధుల వినియోగం, పూర్తయిన పనులు, యూసీల సమర్పణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో బుధవారం సాయంత్రం సమీక్షించారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంలో రాష్ట్రస్థాయిలో శ్రీకాకుళం పార్లమెంట్ తొలి స్థానంలో నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు. మిగతా మంజూరైన పనులన్నీ కూడా వేగవంతం చేయాలని, వాటిని ఒక నెలలోగా పూర్తి చేయాలని, యూసీలు(యుటిలైజేషన్ సర్టిఫికేట్) సబ్మిట్ చేయాలని సూచించారు. శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ 17వ లోక్ సభకు సంబంధించి మొత్తం రూ.23.24 కోట్లతో 455 పనులు మంజూరు చేశామన్నారు. ఇందులో 298 పనులు పూర్తయ్యాయని, కొత్తగా మరో 20 పనులకు ప్రతిపాదనలు పంపామని, మిగతా పనులు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.16 కోట్లను బిల్లుల రూపంలో చెల్లించినట్లు వివరించారు. నిధుల వినియోగంలో శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం పట్ల అధికారులకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ పనులను త్వరితగతిన ప్రారంభించి, రానున్న రెండు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ప్రసన్నలక్ష్మి, నెడ్ క్యాప్ జిల్లా మేనేజర్ సుబ్రహ్మణ్యం, పలువురు ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుని మృతదేహం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : జాడిపూడి-ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ల మధ్య ఎగువలైన్‌కి మధ్య లైన్ ట్రాక్ మధ్యన గుడ్డిపద్ర గ్రామానికి దగ్గర్లో గుర్తు తెలియని యువకుని మృతదేహం ఉన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని హెచ్.సి కోదండరావు పరిశీలించి మరణించిన వ్యక్తి సుమారు 25 నుండి 30 సంవత్సరాలు వయస్సు కల్గి ఉంటాడని, మృతుని మోచేయిపైన దొళాయి అనే ఒరియా అక్షరాలతో వ్రాయబడి ఉన్నందున మృతుడు ఇచ్ఛాపురం సమీప ఒరిస్సా గ్రామానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

భారతదేశంలో విలువలతో కూడిన పార్టీ కాంగ్రెస్

జిల్లా డీసీసీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : కాంగ్రెస్ పార్టీకి ఉన్న వారసత్వ సంపద, విలువలు భారతదేశంలో ఇంకా ఏ ఇతర పార్టీలో లేవని శ్రీకాకుళం జిల్లా డీసీసీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. జిల్లాలో ఒకప్పటి హరిశ్చంద్రాపురం నియోజకవర్గం శాసనసభ్యులు కేపీఎన్ భుక్తను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలసి సత్కరించిన అనంతరం డాక్టర్ పేడాడ మీడియాతో మాట్లాడారు. జిల్లాలో హరిచంద్రపురం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కేపీఎన్ బుక్త, పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు చుక్క పగడాలమ్మ, ధర్మాన నారాయణరావు, శ్రీకాకుళం పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బొడ్డేపల్లి నరసింహులు, కాంగ్రెస్ పార్టీ దివంగత నేతలైన బొడ్డేపల్లి రాజగోపాల్‌రావు, బెండి కూర్మన్న, డోల సీతారాములు, గొర్లె శ్రీరాములునాయుడు, మజ్జి తులసీదాస్, కణితి విశ్వనాథం వంటి వారు శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిలో భాగస్వాములయ్యారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. వందల సంవత్సరాల చరిత్ర సంస్కృతి, విలువలు కలిగిన పార్టీగా ఆపార్టీలో సీనియర్లను గౌరవించడం తమ బాధ్యతని ఆయన అన్నారు. డిసెంబర్ 28న పార్టీ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా తాము ఇటువంటి చరిత్రను గుర్తు చేసుకోక తప్పదన్నారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షులైన గిడుగు రుద్రరాజు, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి వంటి వారు విలువలకు పెద్దపీట వేస్తారని పరమేశ్వరరావు చెప్పారు. హరిచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి వంశధార ప్రాజెక్టు సాధనకు మాజీ శాసనసభ్యులు భుక్తు చేసిన కృషిని ఆయన కొనియాడారు. డిసిసి అధ్యక్షుని ఆధ్వర్యంలో కాంగ్రెస్ బృందం తనని గౌరవించడం పట్ల కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యులు కేపీఎన్ భుక్త సంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఈదేశాన్ని, రాష్ట్రాన్ని, జిల్లాని అభివృద్ధి చేసిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే వంశధార ప్రాజెక్టు ఈ జిల్లాలో ఎక్కువ శాతం పనులు పూర్తయ్యాయని, కళింగ దల్ వంటి ప్రాజెక్టును నిర్మించగలిగామని, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపించామని, మారుమూల గ్రామాలకు విద్యుత్ వైద్యం విద్య వంటి మౌలిక సౌకర్యాలు కల్పించి ప్రజాసేవలో కాంగ్రెస్ పార్టీ పునీతమైందని భుక్త తన అనుభవాల్ని గుర్తుకు చేసుకున్నారు. శ్రీకాకుళం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు డి.గోవింద మల్లిబాబు, శ్రీకాకుళం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెళ్ళ సురేష్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కెవిఎల్ఎస్ ఈశ్వరి, డి.వెంకట్రావు, జి.అప్పారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై మంత్రి సవాల్ విసరడం హాస్యాస్పదం!

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు

విశాలాంధ్ర-పలాస: పలాస నియోజకవర్గం శాసన సభ్యులు, మంత్రి అప్పలరాజు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబు యువగళం పాదయాత్రపై విమర్శలు చేస్తూ ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సవాల్ చేయడం హాస్యాస్పదమని పలాస నియోజకవర్గం టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు విమర్శించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ టికెట్టు కోసం తన పార్టీ అధ్యక్షుడి మెప్పు కోసం లేని ఉత్తరాంధ్ర అభివృద్ధికి పొదరు అద్ది లోకేష్ బాబుకి సవాల్ విసరడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేసారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం పక్కన పెడితే పలాసలో తన హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై శ్రద్ధ పెట్టి అభివృద్ధిని అటకెక్కించారని సొంత పార్టీలోనే జరుగుతున్న చర్చలను ఖండించలేని మంత్రి ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం మాట్లాడే హక్కుని కోల్పోయారని విమర్శించారు. ముందు పలాస అభివృద్ధిపై దృష్టి పెట్టి ఆ తర్వాత ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం మాట్లా దాలని ఈ సందర్భంగా సూచించారు. పలాస అభివృద్ధిపై టీడీపీ తరపున బహిరంగ చర్చకు నేను వస్తానని అందుకు మీరు సిద్ధమా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వంలో మా ఎమ్మెల్యే శివాజీ హయాంలో పలాస నియోజకవర్గానికి 1500 కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు చేస్తే మీరు అందులో పావు వంతు కూడా తెచ్చుకోలేక పోయారని విమర్శించారు. టీడీపీ హయాంలో మంజూరు చేసిన హాస్పిటల్ మరియు మినరల్ వాటర్ ప్రాజెక్టు నిర్మాణాలు ఈ నాలుగేళ్ల నాన్చుకుంటూ ఇప్పుడు వైద్యులు అందుబాటులో లేని ఈ హాస్పిటల్, ఒక్క ఊరికి కూడా ఒక్క నీటి బొట్టు కూడా అందించని మినరల్ వాటర్ ప్రాజెక్టు మీ పబ్లిసిటీ పిచ్చి కోసం హడావుడిగా ముఖ్యమంత్రితో ప్రారంభించేసి ఇప్పుడు చేతులు ముడిచి కూర్చోవడమేనా మీ దృష్టిలో అభివృద్ధా అని ప్రశ్నించారు. జీడిరైతులకు మోసపూరిత హామీలిచ్చి నట్టేట ముంచడం, మీ హయాంలో మందస ఐటీడీఏ మన్యం జిల్లాకు కళ్ళముందు తరలిస్తున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించి గిరిజనులను అంధకారంలోకి నెట్టేయడం, మీ దృష్టిలో అభివృద్ధా అని ప్రశ్నించారు. 2019 ఫిబ్రవరి లో వంశధార బాహుదా నదులు అనుసంధానం కోసం ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం 6350 కోట్లు ప్రతిపాదనలు చేస్తే 2020 లో మీరు రివ్యూ చేసి బుట్టదాఖలు చెయ్యడం మీ ప్రభుత్వ పరిపాలన లో ఒక కాల్వ లో నైనా తట్టెడు మన్ను తీయకపోవడం వలన లక్షలాది ఎకరాలు తీవ్ర దుర్భిక్షానికి గురై కరువు కోరల్లో చిక్కిన రైతుల ఆక్రందనలు మీ అసమర్ధ పాలనకు నిదర్శనం. ఉత్తరాంధ్ర అభివృద్ధి అంటూ సవాళ్లు విసరడం కేవలం వైసీపీ టికెట్టు కోసం వేసిన జిమ్మిక్కులు అని దమ్ముంటే ముందు పలాసలో అభివృద్ధి కోసం చర్చకు నేను సిద్ధం అని సమయం స్థలం మంత్రి చెప్పాలని సవాల్ విసిరారు.

దిమ్మిడిజోల, వల్లభరాయుడుపాడు గ్రామాలకు బస్సుసౌకర్యం కల్పించాలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: టెక్కలి డిపో నుండి నందిగాం మండలం దిమ్మిడిజోల పరిసర కొండల ప్రాంతాలకు, వల్లభరాయుడుపాడు పరిసర గ్రామాలకు పల్లెవెలుగు బస్సులను నడపాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన బుధవారం నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లుతో మాట్లాడారు. మంగళవారం సాయంత్రం నందిగాం మండలంలో నేను జరిపిన పర్యటనలో కొండల ప్రాంతం అయిన పెద్ద తామరపల్లి మొదలు దిమ్మదిజోల గ్రామం వరకు మధ్యలో ఉన్న చాలా గ్రామాలు టెక్కలి డివిజన్ కేంద్రానికి మరియు నందిగాం మండల కేంద్రానికి సుదూరంగా ఉన్నందున టెక్కలి డిపో నుండి పెద్దతామారా పల్లి, కర్లపూడి, నౌగాం, ఖల్లాడ మొదలగు కొండాల ప్రాంతాలను కలుపుతూ దిమ్మిడిజోల గ్రామం వరకు ఉదయం, సాయంత్రం పల్లెవెలుగు బస్సులను నడపాలని, గతంలో ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం ఉండేది. కానీ ప్రస్తుతం వివిధ కారణాలతో ఈ బస్సును తొలగించారని ప్రజలు నాదృష్టికి తీసుకురావడం జరిగిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ గ్రామాలకు బస్సు సర్వీసులను పునరుద్దరించగలరని, ప్రజలకు రవాణా సమస్యలు తొలగించాలని ఆయన కోరారు. అలాగే టెక్కలి డిపో నుండి నందిగాం మండలం మణిగాం, వల్లభరాయుడుపాడు గ్రామాల వరకు ఉదయం, సాయంత్రం పల్లెవెలుగు బస్సులను నడపగలరని ఆయన డిపో మెనేజర్‌కు లెటర్ ద్వారా కోరారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నెరవేర్చాలి

16 రోజులుగా నిరసన

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో అంగన్వాడీ అక్కచెల్లెమ్మలకు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణలో కంటే అధనంగా వేతనాలు ఇస్తానని చెప్పిన హామీను అమలు చేయాలని అంగన్వాడీలు అన్నారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ 16 రోజు బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సిఐటియు ఆద్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు చెల్లించాలని, రాష్ట్రంలో అంగన్‌వాడీలందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5లక్షలు, వేతనంలో సంఘం పించన్ ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్‌కు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసి అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, భీమా అమలు చేయాలని తదితర డిమాండ్‌లును ప్రభుత్వం చెల్లించాలని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, గొండు నీలన్న, దుంపల సుధర్శన, అంగన్వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కలియుగ కర్ణుడు...'స్వామిబాబు' సేవలు చిరస్మరణీయం

- ఎంపిపి, ఆరంగి మురళీధర్

విశాలాంధ్ర-నరసన్నపేట: కలియుగ కర్ణుడు.. పొట్నూరు స్వామిబాబు సేవలు చిరస్మరణీయమని, స్వామిబాబును ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం పొట్నూరు స్వామిబాబు 140వ జయంతి సంధర్భంగా స్థానిక మేజర్ పంచాయితీ కార్యాలయం ఎదురుగా వున్న దివంగత పొట్నూరు స్వామిబాబు విగ్రహానికి ఎంపిపి, ఆరంగి మురళీధర్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నరసన్నపేట పట్టణానికి ఆనుకొని వున్న ఆయన ఆస్థులను పేదలకు దానం చేసిన ఘనత స్వామిబాబుకు దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రతినిధులు, చింతు రామారావు, కెసిహెచ్‌బి.గుప్తా, వైశ్యరాజు కేశవరాజు, సదాశివుని కృష్ణ, బిఎల్.శర్మ, నేతింటి సింహాచలం, ధర్మాన జగన్మోహన్‌రావు, ఇట్రాజు సూరిబాబు, గనగళ్ళ వేంకట శ్రీనివాసరావు, దుల్ల వెంకటరమణ, పంచాయితీ ఈవో, సవర చిన్నారావు, ఎస్‌విసిటి ప్రతినిధులు, డి.రమేష్, పిఎల్.కాంతారావు, సూరపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ 2024 టీమ్ ఆధ్వర్యంలో 'డా.ధర్మాన' పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-నరసన్నపేట: పట్టణంలో హడ్కో కాలనీలో మంగళవారం రాత్రి పోలాకి జెడ్పీటిసి, నియోజకవర్గ యువ నాయకులు, డా.ధర్మాన కృష్ణచైతన్య పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసిపి యువజన ప్రధాన కార్యదర్శి, దండి జయప్రకాష్, టార్గెట్ 2024 టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పుట్టినరోజు కేక్‌ను డా.కృష్ణచైతన్య కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆది నుండి మా కుటుంబంపై నియోజకవర్గ ప్రజలు ఆదరాభిమానాలు చూపిస్తున్నారని, మీతోనే ఎల్లప్పుడూ వుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, ఆరంగి మురళీధర్, మేజర్ పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు, వైసిపి ప్రతినిధులు, రాజాపు అప్పన్న, కెసిహెచ్‌బి.గుప్తా, చింతు రామారావు, పొట్నూరు సాయిప్రసాద్, సవర శైలజ, మరువాడ సుధారాణి, భార్గవ్, ధనరాజ్, తోట భార్గవ్, ముత్తా కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతలో ప్రతిభ వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్ర

- మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం మహిళలు, యువతలో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకే అని స్థానిక మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు అన్నారు. మండలంలోగల కోటబొమ్మాళి సచివాలయం పరిధిలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిభను వెలికితీసి మండల, జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కోసమే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే ఆడాదాం ఆంధ్ర కార్యక్రమం అని అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని సూచించారు.

ఆయోధ్యరాముని అక్షతలు బట్వాడ

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : శ్రీరాముని జన్మస్థలం అయోధ్య నుండి విచ్చేసిన స్వామి వారి అక్షింతలను ప్రతీ ఇంటికి అందించే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉంచిన అక్షింతలను వేర్వేరు బ్యాగుల్లో నింపి గ్రామాల వారీగా బట్వాడ చేస్తున్నారు. విశ్వహింధూ పరిషత్, ఆర్.ఎస్.ఎస్. ప్రతినిధులు రావి రాంప్రసాద్, రావి జయక్రిష్ణల పర్యవేక్షణలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు జరుగుతున్నాయి. బి.జె.పి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బుద్దా నిర్మల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పలు గ్రామాల ప్రతినిధులకు అక్షింతలు ఉంచిన కళశాలను, ఆహ్వాన పత్రికలు కిట్లను అందజేసారు. మండలంలో టి.బరంపురం గ్రామంలో శ్రీరాముని అక్షింతలు అత్యంత ప్రసస్థమైనవిగా భావించి, మండల కేంద్రం నుండి బలరాంపురం గ్రామ సీతారామాలయం వరకు భక్తుల సమక్షంలో శోభయాత్రగా తీసుకెళ్ళారు. మేళతాళాలతో గ్రామానికి చేర్చిన అక్షతలను జనవరి ఒకటి నుంచి ప్రతి గడపకు చేరవేయడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: కోటబొమ్మాళి నుంచి నందిగాం వరకు జరిగిన బైక్ ర్యాలీను విజయవంతం చేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, జనసైనికులకు హృదయపూర్వక ధన్యవాధాలు తెలుపుతున్నానని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. ఆయన బుధవారం స్థానిక విలేకర్లుతో మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరావు అచ్చెన్నాయుడు పిలుపు మేరకు ఇంతవరకు జరగని కనివిని ఎరుగని తీరితో టెక్కలి నియోజకవర్గంలో గల నాలుగు మండలాలకు చెందిన టిడిపి శ్రేణులు, జనసేన సైనికులు పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేశారని ఆయన అనందం వ్యక్తం చేశారు. ఇదే ఊపులో పార్టీకోసం కష్టపడి తెలుగుదేశం పార్టీకి అధికారం తీసుకువద్దామని ఆయన సూచించారు.

రైస్‌మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారు

- రైతులు ఆందోళన

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ధాన్యం కొనుగోలులో రైస్‌మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని కొటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ రైతులు తెచ్చిన ధాన్యంను ఎలాంటి నిబంధనలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని పదేపదే చెబుతున్నప్పటికి ఏదోఒక చాకు చెప్పి ఒక బస్తాకు మూడు నుంచి ఐదు కిలోల ధాన్యం అధనంగా తీసుకుంటున్నారని వారు ఆరోపించారు. ముఖ్యంగా కోటబొమ్మాళికి చెందిన మురళిక్రిష్ణ మోడరన్ రైస్‌మిల్లు యాజమాన్యం ధాన్యం అంతా బాగున్నప్పటికీ, సచివాలయ సిబ్బంది ధాన్యం బాగుంది అని చెబుతున్నా బస్తాను మూడు కేజీలు అధనంగా తీసుకుంటున్నారని, ఏమిటి ఈ దారుణం అంటే అసభ్యకరంగా మాట్లాడుతున్నారని రైతులు యర్నాగుల నాగేశ్వరరావు, సూర్యనారాయణలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం ఎండలకు, వానలకు కష్టపడి వనిచేసి వండించిన పంటను వీరి దగ్గరకు తెచ్చి వారికి నచ్చినట్లు ఇవ్వాల్సి వస్తుందని వారు అందోళన వ్యక్తంచేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించి రైతులకు ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

చేతకాని తనంతో మంత్రి డా. సీదిరి సవాల్...

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బాబురావు

విశాలాంధ్ర-పలాస : పలాస నియోజకవర్గంలో అభివృద్ధి చేతకాక ప్రజల దృష్టి మార్చడానికి మంత్రి డా. సీదిరి సవాల్ అని తెరపైకి తీసుకు వచ్చారని రాష్ట్ర కార్యదర్శి బాబురావు ఆరోపించారు. బుధవారం పలాస టీడీపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెటి రోడ్ నిర్మాణం అని కూల్చడం ప్రారంభించిన మంత్రి సంవత్సరాలు దాటిన పూర్తి చేయలేకపోయారని ఇప్పటికైనా కెటి రోడ్ పూర్తి చేశామని చెప్పే దమ్ముందా వైసిపి నాయకులకు అని పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధి పట్ల సకాలంలో స్పందించి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తెలుగుదేశం పార్టీ తీసుకుందని దానిలో భాగంగా క్రిపా పేరుతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ కు నాడు చంద్రబాబు నాంది పలికారని గుర్తు చేశారు.బాధ్యత రాహిత్యంతో, అక్రమ వసూళ్ళతో నిర్మాణం జాప్యం చేశారని, చివరికి చేతకాక మాజీ ఎమ్మెల్యే శివాజీ హయాంలో పలాస సామాజిక ఆసుపత్రిలో రూపకల్పన చేసిన దయాలసిస్ కేంద్రంలో పరికరాలు 200 పడకల రీసెర్చ్ సెంటర్ కు తరలించడం మీ అభివృద్ధికి అద్దం పడుతుందని పేర్కొన్నారు. 700 కోట్లతో అసంపూర్ణ నిర్మాణాలు చేపట్టి ఒక్క గ్రామానికైన చుక్క నీరు అందించారా? అని ప్రశ్నించారు. మీ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని అన్నారు. బిసి రాష్ట్ర కార్యదర్శి లోడగల కామేశ్వరరావు మాట్లాడుతూ సవాల్ స్వీకరించి టిడిపి మాజీ మంత్రి కొల్లు రవీంద్ర విజయవాడ ప్రెస్ క్లబ్ లో ఉదయం నుండి మంత్రి తో చర్చకు సిద్ధపడినా పలాస మంత్రి ఎందుకు వెళ్ళలేదో ప్రజలకు తెలియజేయాలని, ఇటువంటి సవాళ్లు విసిరి తప్పించుకొనే సందర్భాలు వైసిపి నాయకులకు అలవాటని అన్నారు.లోకేష్ ను విమర్శించడానికి సీఎం జగన్మోహన్రెడ్డి కే అర్హత లేదని మంత్రి ఎంత అని పేర్కొన్నారు. రాష్ట్ర తెలుగు యువత తరుపున మంత్రి సవాల్ స్వీకరిస్తున్నాం టీడీపీ కార్యకర్త సమాధానం చెప్పడమే ఎక్కువ లోకేష్ తో సవాల్ చేసే స్థాయి కాదని రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు శశిభుషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో కౌన్సిలర్ సూర్యనారాయణ, అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మూడేళ్ల చిన్నారిని ఆదుకున్న మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-పలాస : తనను నమ్ముకున్న నియోజకవర్గ ప్రజలకు ఆదుకోవడమే ఆయన ప్రవృత్తి. ఎటువంటి ఆపద వచ్చినా అర్ధరాత్రి తన ఇంటి తలుపులు తడితే వెంటనే ఆ ఆపదను వారి దరిదాపులో లేకుండా చేయడమే ఆయన నైజం. రెండేళ్ల క్రితం మహమ్మరిలా వ్యాపించిన కరోనా సమయంలో కూడా ధైర్య సాహసాలతో అనేక మందిని కాపాడిన వ్యక్తిత్వం పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుది. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మూడేళ్ల చిన్నారి నైమిషాను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదుకోవడంతో చిన్నారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలాస మండలం శాసనం గ్రామానికి చెందిన గిన్ని యోగేష్, మణిల గారాలపట్టి మూడేళ్ల నైమిషా. ఆ చిన్నారికి బ్లడ్ క్యాన్సర్ ఉందని ఈ ఏడాది ఫిబ్రవరిలో డాక్టర్లు గుర్తించారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ పినాకిని ఆసుపత్రికి పంపించారు. ఆ చిన్నారిని వైద్య పరీక్షలు చేసి క్యాన్సర్ ఉందని నిర్ధారించారు. ఖర్చుతో కూడుకున్న వైద్యమని ఆ తల్లిదండ్రులకు ఆసుపత్రి వర్గాలు తెలియజేయడంతో వారు నిరాశ చెందారు. పాప వయస్సు తక్కువ కావడం చికిత్సను అందించలేమని తేల్చి చెప్పేశారు. అనంతరం నైమిషాను తల్లిదండ్రులు విశాఖలోనే మెడికవర్‌కు తీసుకుపోయారు. అక్కడ వైద్యులు 8 నెలల వరకు చికిత్సను అందించారు. అప్పటికే 8 లక్షల రూపాయలు ఆ పేద కుటుంబం అప్పులు చేసి ఖర్చు పెట్టేశారు. అయినా క్యాన్సర్ తగ్గుముఖం పట్టలేదు. బోన్‌మరో ట్రాన్స్‌ప్లంట్ చేయాలని నిర్ధారించారు. దీనికి 20 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో అప్పటికే ఉన్నదంతా పాప క్రింద ఖర్చు పెట్టేసిన తల్లిదండ్రులకు నిరాశ మిగిలింది. వెల్డర్‌గా పని చేస్తున్న నైమిషా తండ్రి యోగేష్‌కు ఏం చేయాలో తోచలేదు. ఏకైక బిడ్డ నైమిషాను ఏలాగైనా బ్రతికించుకోవాలనే తాపత్రాయం, ఆశతో ఉన్న ఏం చేయలేని నిశ్చయస్థితిలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వద్దకు వచ్చి తన ఆవేదనను తెలిపారు. వెంటనే మంత్రి స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధికి సిపార్సు చేశారు. సి.ఎం.వో కార్యాలయంకు యోగేష్‌ను పంపించి స్వయంగా పర్యవేక్షించారు. దాంతో ఫలితం దక్కింది. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నైమిషా వైద్యంకోసం 13 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఆ సొమ్ముతో తెలంగాణ రాష్ట్రం నల్గొండలో గల సిటిజన్ ఆసుపత్రిలో నైమిషాకు బోన్‌మరో ట్రాన్స్‌ప్లంట్ జరిగింది. అక్కడ 4నెలలు నిరాటంకంగా పాపకు ఆసుపత్రి వర్గాలు చికిత్సను అందించారు.

దాచిన చిత్రం)

ప్రస్తుతం పాప ఆరోగ్యం కొంత మెరుగైంది. పూర్తి మెరుగయ్యేందుకు ఇంకా 4 లక్షల రూపాయలు అవసరమని ఆసుపత్రి వర్గాలు తెలపడంతో మళ్లీ మంత్రి డాక్టర్ సీదిరి దృష్టికి నైమిషా తండ్రి యోగేష్ తీసుకువెళ్లారు. ఆసమయంలో కుటుంబంతో తిరుపతి బయలుదేరేందుకు సిద్దంగా ఉన్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వెంటనే స్పందించి ఆగమేఘాలపై ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు సి.ఎం.వో కార్యాలయానికి సిపార్సు ఉత్తరాన్ని యోగేష్‌కు అందజేసి నైమిషా ఆరోగ్యం పూర్తిగా మెరుగవ్వాలని మంత్రి డాక్టర్ సీదిరి ఆకాంక్షించారు. అప్పుల పాలైన తనను దాతలు ఆదుకోవాలని నైమిషా తల్లిదండ్రులు యోగేష్, మణిలు కోరుతున్నారు. సహాయం చేసేందుకు దాతలు ముందుకు వస్తే 9618682667కు ఫోన్‌పే చేయాలని కోరారు.

పేదల సంక్షేమం ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యం

జడ్పీ చైర్పర్సన్ విజయసాయిరాజ్

విశాలాంధ్ర-సోంపేట : పేదల సంక్షేమం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమని జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలం కేంద్రం సోంపేట టౌన్ లో జగనన్న కోలని పరిధిలో జలజీవన్ మిషన్ 71లక్షల రూపాయల నిధులతో ఇంటింటికి మంచినీటి కుళాయి నిర్మాణ పనులకు జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ చేతులు మీదుగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలకోసం నిరుపేదల కోసం ఎల్లప్పుడూ ఆలోచించి వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని నిరుపేదవర్గాల కళ్లలో ఆనందాన్ని చూసేందుకు ఆయన ఎంతవరకైనా వెళ్తారని ఆయన పేదల పాలిట వరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, మండల పార్టీ అధ్యక్షుడు సిలగాన భాస్కర్ రావు, సోంపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపీటీసీ సభ్యులు పొడుగు కామేష్, వైయస్సార్సిపి నాయకులు మాదిన ధనం, మల్లా వెంకటరమణ, వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి డా. సీదిరి ఇంటిని చుట్టుముట్టిన అంగన్వాడీ కార్యకర్తలు

విశాలాంధ్ర-పలాస: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డా.సీదిరి అప్పలరాజు ఇంటిని బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు చుట్టుముట్టారు. కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు నుంచి పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు భారీ ర్యాలీగా మంత్రి డా. సీదిరి అప్పలరాజు ఇంటి వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు భారీ స్థాయిలో మోహరించారు. మంత్రి ఇంటి వద్దకు అంగన్వాడీ లు వెళ్ళేందుకు ప్రయత్నించగా గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు, పోలీసులు మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. గేట్ వద్ద కూర్చోడం వలన జిఎంఈ కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొంచెం పక్కకు కూర్చోమని పోలీసులు చెప్పిన అంగన్వాడీ కార్యకర్తలు ససేమిరా అంటూ అలాగే కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. మంత్రి సీదిరి అప్పలరాజు వచ్చే వరకు వెళ్ళేది లేదంటూ తేల్చి చెప్పారు. అనంతరం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అంగన్వాడీ కార్యకర్తలు వద్దకు వచ్చారు. అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ గణపతి, సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు యం మంజుల, బి సునీత, కె జ్యోతి, బి చామంతి, బి నిర్మల,జయలక్ష్మి, నారాయణి, ఆర్ భవాని పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి నిత్యవసర సామాగ్రి అందజేత

విశాలాంధ్ర-రణస్థలం : మండలం రణస్థలం పంచాయతీలో ఇటీవల మృతిచెందిన ఆదపాక నీలమ్మ కుటుంబ సభ్యులకు, రాష్ట్ర సర్పంచుల సంఘం ఆర్గనైజర్ సెక్రెటరీ, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఛాంబర్ అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు ఆర్థిక సాయంగా 50 కేజీల రైస్ అందించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకటరమణ, వార్డు మెంబర్ కేలం వెంకటరమణ, పిన్నింటికేశ్వరరావు, అదపాక పండు ఆదపాక చిన్న, ఆదపాక అప్పారావు, ఆదపాక చంద్రరావు, ఆదపాక కాశీబాబు, ఆదపాక పైడిరాజు, ఆదపాక గొల్లారావు, ఆదపాక యుగంధర్, ఆదపాక కోటి, కుటుంబ సభ్యులు

పేటిఎం మిషన్లు పంపిణీ

విశాలాంధ్ర-మందస : మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం పేటిఎం విధానంలో స్త్రీ నిధి వాయిదాల చెల్లింపు కోసం పేటిఎం మిషన్లను క్లస్టర్ సిసిలకు పంపిణీ చేసినట్లు సెర్ప్ ఎ.పి.ఎం జి.ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ నిధి రుణ వాయిదాల చెల్లింపులు సులభతరం చేసుకునేందుకు పేటిఎం మిషన్లు ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు. కార్యక్రమంలో కిశోర్, తేజ, ముఖలింగంలు పాల్గొన్నారు.

జనవరి 22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

- జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం పూర్తి స్థాయి ఓటర్ల తుది జాబితాను జనవరి 22న విడుదల చేస్తామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు చెప్పారు. అంతకు ముందు ఈ తేదీ జనవరి 5గా ఉందని అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో 24వ వారపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటరు నమోదు కోసం అక్టోబర్ 28 నుంచి డిసెంబర్ 9 మధ్య జిల్లాలో 49649 మంది దరఖాస్తులు చేసుకున్నారని కానీ సరైన ధృవీకరణ పత్రాలు సమర్పించని కారణంగా వాటిలో 2492 దరఖాస్తులు తిరస్కరించినట్లు చెప్పారు. అలాగే వివిధ కారణాలు చూపుతూ 51,270 ఓట్లు తొలగింపు కోసం దరఖాస్తులు వస్తే వాటిని పరిశీలించి 47,327 ఓట్లను తొలగించామని అన్నారు. వాటిలో మృతుల పేరుతో 14982 ఓట్లు ఉన్నాయని, రెండు ఓట్లు కలిగిన 10,040 మంది ఓట్లు కూడా వాటితో కలిపి తొలగించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, ఇతర సవరణల కోసం వచ్చిన క్లైముల పరిశీలన తుది దశకు చేరిందని ఎన్నికల కమీషన్ సూచనల మేరకు వచ్చే నెల 12వ తేదీ నాటికి వాటిని వాటిని పరిష్కరిస్తామన్నారు. ఇంకా అర్హత ఉన్న వారు ఓటు హక్కు పొందేందుకు ఫారం 6 ను నేరుగా గానీ, ఆన్లైన్ లో గానీ ఇప్పుడు కూడా ఇవ్వ వచ్చునని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వాటిని పరిశీలించి, సాధారణ ఎన్నికల నామినేషన్లకు పది రోజుల ముందు ప్రచురించే అనుబంధ (సప్లిమెంట్) జాబితాలో వాటిని చేర్చడం జరుగుతుందని వివరించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఈ సమావేశానికి రౌతు శంకర్రావు (వైఎస్ఆర్సిపి), పి.ఎం.జే.బాబు(టిడిపి), గోవింద మల్లిబాబు (కాంగ్రెస్), ఏ.కేశవరావు, జి.రామారావు (బీఎస్పీ) సీ సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు, తదితరులు హాజరయ్యారు.